క్లుప్తంగా

శ్రీశైలంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల సోదాలు

● హోటల్ నిర్వాహకులపై చర్యలు


పన్నీర్‌ను డస్ట్ బిన్‌లో పడేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

శ్రీశైలం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు సోమవారం పలు హోటళ్లు, షాపుల్లో సోదాలు నిర్వహించారు. భ్రమరాంబా హోటల్‌లో విక్రయానికి ఉంచిన పన్నీర్‌ను పరిశీలించి కాలపరిమితి దాటిన విషయాన్ని గమనించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, నంద్యాల జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఖాశీంవలి మాట్లాడుతూ కాలం చెల్లిన పన్నీర్ ప్యాకెట్లు విక్రయిస్తున్న భ్రమరాంబా హోటల్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. భక్తులకు నాణ్యమైన తినుబండారాలే విక్రయించాలని హోటళ్ల నిర్వాహకులకు సూచించారు.

ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం


ఖైదీల వివరాలు తెలుసుకుంటున్న లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు: ఆర్థిక స్తోమత లేని వారికి ఉచిత న్యాయవాది ఏర్పాటు చేస్తామని కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి అన్నారు. సోమవారం స్థానిక సబ్‌జైల్‌ను తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడారు. 60 ఏళ్లు పైబడిన వారు ఎవరైన ఉన్నారా అని ఆరా తీశారు. జైల్‌లో కల్పిస్తున్న సదుపాయలు, భోజనాలు గురించి ఆరా తీశారు.

పీఎం కిసాన్ 19వ విడత నగదు విడుదల

వెలుగోడు: మండలంలో 5,759 మంది రైతులకు పీఎం కిసాన్ నగదు జమ అయిందని వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన 19వ విడతను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బిహార్‌లోని భాగల్‌పూర్‌లో విడుదల చేశారన్నారు. దేశం మొత్తం 9.7 కోట్ల మంది రైతులకు రూ.21,500 కోట్ల నగదు విడుదల చేశారన్నారు. కాగా వెలుగోడు మండలంలో 5,759 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులుగాను 3,493 మంది రైతులు మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుని 11 అంకెల విశిష్ట ఐడీని పొందారు. మిగతా 2,498 మంది రైతులు రైతు సేవ కేంద్రం వద్ద ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏఓ సూచించారు.

ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోవాలి


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆత్మకూరు: ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేసి, ఆప్కాస్ రద్దు ఆలోచన విరమించుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ డబ్బు జమ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, మహమ్మద్, లాలు, చాంద్‌బాషా పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

● చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, డీసీ ఎం.రామాంజనేయులు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, డీసీ ఎం.రామాంజనేయులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మహిళలు, వృద్ధులు, వికలాంగులకు వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. వాహనాల పార్కింగ్ వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. దర్శనం అనంతరం బయటికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మ్యాట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆర్జిత సేవా టికెట్లు జారీ, ప్రసాదాల టికెట్లతో పాటు ప్రసాదాలను ఇచ్చేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది ప్రత్యేకంగా భక్తులకు సౌకర్యంగా ఉండేందుకు అదనపు క్యూలైన్లు వేశామని, వీటితో పాటు మహిళలు, పురుషులకు వస్త్రాలు మార్చుకునేందుకు గదులను ఏర్పాటు చేయించామని తెలిపారు.

మహిమాన్విత క్షేత్రం.. ఓంకారం!


భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు

● మహా శివ ఉత్సవాలకు ముస్తాబవుతున్న క్షేత్రం
● నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
● 28న రథోత్సవం

బండిఆత్మకూరు: ఓంకారేశ్వరుడు కోరిక కోర్కెలు తీర్చే స్వామిగా ప్రసిద్ధి. అందుకే ఇక్కడి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. కోరికలు తీరిన వారు.. కోరికలు కోరుకుని ముడుపులు కట్టుకునే భక్తులతో ఆలయం ఎప్పుడు రద్దీగా ఉంటుంది. ఆలయానికి తూర్పు, దక్షిణ ద్వారాలు కలిగి ఉన్నాయి. ఈశాన్యంలో పుష్కరిణి కలిగి ఉండడటం, సిద్ధులు తపస్సు చేసిన ప్రదేశంగా ప్రసిద్ధి చెందింది.

ఆలయ చరిత్ర

ఇక్కడున్న శివలింగాన్ని సిద్ధేశ్వరుడు అనే ముని ప్రతిష్ఠించాడని పురాణాలు చెబుతున్నాయి. కొన్ని వందల ఏళ్ల క్రితం సిద్ధేశ్వరుడు అనే ముని తపస్సు చేసుకునేందుకు బయలుదేరి ఈ ప్రాంతానికి చేరుకున్నప్పుడు ఓం అనే శబ్దం వినిపించిందట. తాను తపస్సు చేసుకునేందుకు ఇదే సరైన ప్రదేశమని నిర్ణయించుకున్న ఆ ముని ఇక్కడ ఓ శివలింగాన్ని ప్రతిష్ఠించి తపస్సు మొదలు పెట్టాడట. అప్పటి నుంచే ఈ ఆలయానికి ఓంకార సిద్ధేశ్వర స్వామి అనే పేరు వచ్చింది. ఆ ముని వల్లే ఇక్కడ పంచ బుగ్గ కోనేరు వెలసిందనీ... ఆ నీటితోనే పార్వతీపరమేశ్వరులకు రోజూ అభిషేకం నిర్వహిస్తారనీ చెబుతారు. వ్యాస మహర్షి అశ్వత్థనారాయణ స్వామి (ఆంజనేయస్వామి)ని ఇక్కడ ప్రతిష్ఠించడంతో ఈ ప్రాంతానికి ఆంజనేయుడు క్షేత్రపాలకుడిగా వ్యవహరిస్తున్నాడు. కొన్నాళ్లకు వేంకటేశ్వర స్వామి, దుర్గాదేవి ఆలయాలనూ ఇక్కడ నిర్మించారు. ఇక్కడ అన్నదానం ప్రారంభించడానికి కాశీ నాయన అనే యోగి కారణమని అంటారు. నెల్లూరు జిల్లా బెడుసుపల్లిలో జన్మించిన కశిరెడ్డి మొదటి నుంచీ ఆధ్యాత్మిక చింతనలో ఉండేవాడు. కొన్నాళ్లకు ఓ స్వామీజీ వద్ద మంత్రదీక్ష తీసుకుని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తూ చివరకు 1933లో ఇక్కడకు చేరుకుని ఆశ్రమం ఏర్పాటు చేశాడనీ ప్రతీతి. కశిరెడ్డి మహిమలు తెలిసిన భక్తులు ఆ యోగిని 'నాయనా' అని పిలవడం మొదలుపెట్టడంతో ఆ స్వామి కాశీనాయనగా గుర్తింపు పొందాడట. ఆకలిగా ఉన్నవారికి లేదనకుండా అన్నం పెట్టాలనే సందేశాన్ని చాటిన ఈ యోగి ఇక్కడే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించాడనీ, ఆయన పరమపదించాక అద్దాల మండపాన్ని కట్టి ఆ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి నిత్యాన్నదానాన్ని కొనసాగిస్తున్నారనీ అంటారు. ధర్మస్థాపనకు కృష్ణభగవానుడు వీరభోగ వసంతరాయలు రూపంలో ఎప్పుడైనా రావొచ్చని కాలజ్ఞానంలో రాసి ఉందనీ, అలా వచ్చే స్వామికి నివేదించాలనే ఉద్దేశంతోనే ఇలా పదమూడు రకాల వంటకాలతో భోజనాలు సిద్ధం చేస్తుంటామనీ చెబుతారు.

నేటి నుంచి మార్చి 1 వరకు ఉత్సవాలు

మహాశివ రాత్రి సందర్భంగా మంగళవారం మార్చి 1వ తేది వరకు ఉత్సవాలకు ఓంకార క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. 25న బండిఆత్మకూరు గ్రామంలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. 26న ఉత్సవమూర్తులకు మంగళవాయిద్యాలతో బండిఆత్మకూరు గ్రామం నుంచి బయలుదేరి శింగవరం, సోయయాజులపల్లె, గ్రామాల్లో గ్రామోత్సవం జరిపి ఆలయ ప్రవేశం చేసి, గణపతిపూజ, రక్షాబంధనం, ధ్వజారోహణం, వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రాత్రి ఉత్సవమూర్తులకు కళ్యాణం ఉంటుంది. 27న నంది వాహనోత్సవం, 28న రథోత్సవం అనంతరం వసంతోత్సవం ఉంటుంది. మార్చి 1న స్వామివారు ఓంకారం నుంచి బయలుదేరి బండిఆత్మకూరు చేరటంతో బ్రహోత్సవాలు ముగుస్తాయి. భక్తులు ఓంకారం చేరుకునేందుకు నంద్యాల, బండిఆత్మకూరు, ఆత్మకూరు ఆర్టీసీ డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశారు.


ఆలయ ప్రాంగణంలోని ప్రధాన కోనేరు


శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఓంకారక్షేత్రం


భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

భక్తులే అన్నీ సమకూరుస్తారు

కొండపైనున్న శివాలయంతోపాటూ ఇతర ఉపాలయాల్లో పూజల్ని నిర్వహించే భక్తులు ఆ తరువాత కాశీనాయన క్షేత్రానికి చేరుకుంటారు. సాధారణ రోజుల్లో రోజుకు దాదాపు 1,500 మంది భోజనం చేస్తే కార్తీక మాసం, శివరాత్రి సమయాల్లో అయిదారు లక్షల మందికి అన్నసంతర్పణ జరుగుతుంది. ఈ ఆశ్రమంలో మధుమేహులకు ప్రత్యేక కౌంటరు ద్వారా కొర్ర అన్నం, రాగి,లడ్డూ వంటివి వడ్డిస్తారు. ఇరవై నాలుగు గంటలూ ఇక్కడ పొయ్యి వెలుగుతూనే ఉంటుందనీ, ఇందుకు అవసరమైన నిత్యావసరాలను భక్తులే ఎప్పటికప్పుడు సమకూరుస్తుంటారనీ అంటారు. అర్ధరాత్రో, అపరాత్రో ఇక్కడికి వచ్చేవారు భోజనం వండుకుని తినేందుకు వీలుగా నిత్యావసరాలను ఈ ప్రాంగణంలో ఉంచుతారు. ఏటా 20 లక్షల మంది ఇక్కడ భోజనం చేస్తారు.

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం



మహాశివరాత్రి సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేస్తున్నాం. స్వామి వారి బ్రహ్మోత్సవాలతో అధికంగా వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక క్యూలైన్లు, పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశాం. తాగునీటి, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నాం.

– నాగప్రసాద్, ఈఓ, ఓంకారక్షేత్రం

పంట కోత ప్రయోగం పరిశీలన


పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉప గణాంక అధికారి రామాంజనేయులు

నందికొట్కూరు: మండల పరిధిలోని దామగట్ల పొలిమేరలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద సర్వే నంబరు 137లో రైతు మల్లా వహీద్‌మియ్యా సాగుచేసిన శనగ పొలంలో సోమవారం పంట కోత ప్రయోగం చేపట్టారు. యూనిట్ నంబరు-6, ప్లాటు నంబరు-3లో శనగ పంట కోత కోయగా 3, 760 కేజీలు, ప్లాటు నెంబరు-4లో 2, 920 కేజిలు దిగుబడి వచ్చిందని, ప్లాటు నంబరు-4లో సర్వే నెంబరు 271లో రైతు లక్ష్మిరెడ్డి వేసిన శనగ పంట దిగుబడి కొలతల నంద్యాల జిల్లా ఉప గణాంక అధికారి రామాంజనేయులు తెలిపారు. ఈయన వెంట పంటల బీమా ఏజెంట్ మునావర్ బాషా, వీహెచ్ఏ మౌనిక, ఎంపీఈఓ హేమాదేవి, వీఆర్ఓ మద్దిలేటి, వీఆర్ఏ శ్రీనివాసులు, పుల్లయ్య ఉన్నారు.

తీవ్ర అస్వస్థతకు గురైన యువతి

శ్రీశైలం: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా వస్తున్న భక్తురాలు సరస్వతీ తీవ్ర అస్వస్థతకు గురైంది. పాదయాత్రగా వస్తున్న నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి గమనించి వెంటనే రిస్క్యూ టీం, మెడికల్ క్యాంపు, అటవీ సిబ్బందికి సమాచారం అందజేశారు. తన కార్యకర్తలతోపాటు రిస్క్యూ టీం యువతిని డోలీలు కట్టి మోసుకుంటూ భీమునికొలను నుంచి కైలాస ద్వారం వరకు చేర్చారు. అక్కడ మెడికల్ సిబ్బంది ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స కోసం అంబులెన్స్ ద్వారా వైద్యశాలకు తరలించి ఆమెను రక్షించినట్లు తెలిపారు.

పాదయాత్రగా శివస్వాములు..


శ్రీశైలం బయలుదేరిన శివస్వాములు

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామానికి చెందిన పలువరు శివమాలధారులు ఇరుముడులతో శ్రీశైలానికి కాలినడకన సోమవారం బయలుదేరి వెళ్లారు. ముందుగా సిద్ధేశ్వర స్వామి, మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు శివస్వాములను సాగనంపారు.

మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి


పాతాళగంగ వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర దేవదాయవాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పరిశీలించారు. శివమాల విరమణ చేసే శివదీక్షా శిబిరాలను పరిశీలించి, పలువురు భక్తులతో మాట్లాడారు. అలాగే జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ పాతాళగంగ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. పలువురు భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

శ్రీశైల మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై ప్రత్యేక చర్యలు

శ్రీశైల దేవస్థానం భవిష్యత్ అభివృద్ధి దృష్ట్యా మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై ప్రభుత్వం ప్రత్యేకంగా చర్చలు జరుపుతోందని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. భ్రమరాంబా అతిథి గృహంలో దేవదాయశాఖ అధికారులతో శ్రీశైలక్షేత్ర అభివృద్ధిపై సమీక్షించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శ్రీశైల దేవస్థాన భూవివాదాలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమీక్షలో రాష్ట్ర దేవదాయవాఖ కమిషనర్ రామచంద్రమోహన్, శ్రీశైల దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పగిద్యాల: స్థానిక ఆదర్శపాఠశాల(మోడల్ స్కూల్)లో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరవ తరగతి ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుజన సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75, బీసీ, ఓసీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.లక్ష్మణరావు సోమవారం తెలిపారు. మార్చి 31లోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


మొదటి బహుమతి సాధించిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న రంగనాథ్ శర్మ

వెలుగోడు: బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రిటైర్డ్ ప్రిన్సిపాల్ రంగనాథ్ శర్మ సూచించారు. సోమవారం వెలుగోడు స్టూడెంట్స్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జీబీఎం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి సతీమణి రాములమ్మ జ్ఞాపకార్థం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ హెగ్డే, జీబీఎం పాఠశాల కరస్పాండెంట్ మండ్ల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే పీఎం కిసాన్

జూపాడుబంగ్లా: రైతుసేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతుల బ్యాంకు ఖాతాల్లో పీఎం కిసాన్ నగదు జమ అవుతున్నట్లు ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తంగడంచ రైతుసేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. మండలం వ్యాప్తంగా 6,566 మంది రైతులున్నట్లు తెలిపారు. వారందరూ ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

నిరుద్యోగులను మభ్యపెడుతున్న కూటమి ప్రభుత్వం

● వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సురేష్‌యాదవ్


మాట్లాడుతున్న వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్

నందికొట్కూరు: నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మభ్యపెడుతోందని వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సురేష్ యాదవ్ విమర్శించారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గ్రూప్-2 పరీక్ష ఉండదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చివరి వరకు నమ్మించే ప్రయత్నం చేశారన్నారు. గ్రూప్-2 అభ్యర్థుల అభ్యంతరాలను వింటున్నట్లు, న్యాయం చేస్తున్నట్లు నటించి చివరకు తమ చేతిలో లేదని చేతులెత్తేయడం సిగ్గుచేటన్నారు. ఇంతటి గందరగోళం మధ్య పరీక్ష నిర్వహణ ఎట్టి పరిస్థితిలోనూ ఆమోదయోగ్యం కాదని ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై లాఠీ చార్జ్ చేసి, కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. డీఎస్సీపై తొలి సంతకం చేసి నిర్వహించకుండా కాలయాపన చేయడం కూటమి ప్రభుత్వానికి తగదన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ ఇంత వరకు పూర్తి చేయలేని హీన స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. వలంటీర్లను నమ్మించి మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌లో 18 వేల మందిని తీసేసి వారి కుటుంబాల కన్నీటికి కారకులై చంద్రబాబు చరిత్రలో నిలిచిపోయారన్నారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మాధురి, పట్టణ అధ్యక్షులు అబ్దుల్లా, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు హిదాయతుల్లా పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

వెలుగోడు: భార్య కాపురానికి రావడం లేదని మండల కేంద్రంలోని గాంధీ నగర్‌కు చెందిన వజీద్ ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వజీద్ భార్య కొంతకాలం క్రితం పుట్టినింటికి వెళ్లి తిరిగి రావడం లేదు. దీంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగాడు. గమనించిన తండ్రి షేక్‌బాషా వెంటనే నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు.

నాటుసారా విక్రేత అరెస్ట్

మహానంది: మండలంలోని గాజులపల్లెలో నాటుసారా విక్రయిస్తున్న వారిపై దాడులు నిర్వహించి ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి తెలిపారు. నిందితుడి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు.

వెల్లువెత్తిన భక్తిభావం.. తొలగుతున్న బతుకు భారం

● పాదయాత్ర మార్గం పొడవునా లబ్ధి పొందుతున్న చిరువ్యాపారులు


బ్యాగులు రిపేరు చేస్తున్న వెంకటయ్య


ఊత కర్రలు అమ్ముతూ చెంచులు

ఆత్మకూరురూరల్: శ్రీశైలం వెళ్లే మల్లికార్జునుడిని ధూళి దర్శనం చేసుకుని వీలైతే స్పర్శదర్శనం చేసుకుని జీవన్ముక్తులు కావాలని లక్షలాది మంది పాదయాత్రతో నల్లమల అడవులగుండా సాగుతున్నారు. లక్షల మంది ఓ చోట కదులుతున్నారంటే వారి చిన్నచిన్న అవసరాలు తీర్చేందుకు వస్తువులు అందుబాటులో ఉంచేందుకు చిన్నతరహా వ్యాపారులు తయారవుతారు. అలా పాదయాత్ర మొదలయ్యే వెంకటాపురం మొదలు గోషాయి కట్ట ఆంజనేయస్వామి, నాగలూటి దర్గా, నాగలూటి వీరభద్రాలయం, దామెర్లకుంట, పెచ్చెర్వు ఇలా 40 కిలోమీటర్ల అడవి మార్గంలో ముఖ్య కేంద్రాల్లో చిన్న చిన్న దుకానాలు పెట్టుకుని పలువురు జీవనం సాగిస్తున్నారు. వెంకటాపురంలో చిన్న పాటి టార్చ్ లైట్‌లు, సాక్స్‌లు, మినరల్ వాటర్ విక్రయిస్తున్న వాళ్లే గాక ఆర్ఎంపీలు కూడా తాత్కాలిక షెల్టర్లు ఏర్పాటు చేసుకుని క్లినిక్‌లు నడుపుతున్నారు. ఇక అడవిలో ఆదిమ చెంచు గిరిజనులు తమకు తోచిన విధంగా పాదయాత్ర సీజన్‌ను ఉపయోగించుకుంటున్నారు. వెదురు పొదలను వేళ్లతో సహా పెకిలించి వాటిని ఊత కర్రలుగా మలిచి, పాదయాత్రికులకు రూ.50 కి ఒకటి చొప్పున విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. టెంకాయలు కూడా భారీగా నిల్వ చేసుకుని లాభానికి అమ్ముతున్నారు. కలింగర పండ్లు అమ్మే వాళ్లు, చిన్నచిన్న హోటళ్లు నిర్వహించే వారే గాక దారిపొడవునా ఐస్ క్రీం బళ్లు కూడా కనిపిస్తున్నాయి. ప్రజల భక్తిభావం పలువురు పేదలకు తాత్కాలిక ఉపాధి కలిగిస్తుండడం సమాజాభివృద్ధికి శుభసూచకమే. జూపాడుబంగ్లాకు చెందిన జంగాల వెంకటయ్య తన భార్యతో కలిసి పాదయాత్ర మార్గంలో బ్యాగులు రిపేరు చేసే దుకాణా ఏర్పాటు చేసుకున్నాడు.

మొక్కుబడిగా పీజీఆర్ఎస్

పగిద్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మొక్కుబడిగా సాగింది. మండల స్థాయి అధికారులు సమయపాలన పాటించకుండా ఇష్టారీతిగా అటెండెన్స్‌లో సంతకాలు చేసి వెళ్లారు. ఎంపీడీఓ సుమిత్రమ్మ, డిప్యూటీ తహసీల్దార్ మురళీ, మరో అధికారి మాత్రమే చివరి వరకు ఉన్నారు. మిగతా వారు ఇలా వచ్చి అలా వెళ్లారు.

● **కొత్తపల్లి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో నలుగురు అధికారులు తప్ప మిగతా వారు గైర్హాజరయ్యారు. ఎంపీడీఓ మేరి, కిందిస్థాయి అధికారులు తప్ప మండల స్థాయి అధికారులెవ్వరూ హాజరు కాకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ప్రజలు గుసగుసులాడారు.

గుండెపోటుతో భక్తురాలి మృతి

శ్రీశైలం: మహాశివరాత్రి సందర్భంగా మల్లన్న దర్శనానికి వచ్చిన మహారాష్ట్రలోని కొల్హాపూర్‌కు చెందిన భక్తురాలు శివాజీ కుర్దే (64) గుండెపోటుతో మరణించారు. బంధువులతో కలిసి ఆమె సోమవారం శ్రీశైలం చేరుకుని మల్లన్నను దర్శించుకున్నారు. అనంతరం యజ్ఞవాటిక వద్ద ఉన్న టాయిలెట్స్ సమీపంలో సొమ్మసిల్లిపడిపోయింది. వెంటనే ఆమెను బంధువులు స్థానిక దేవస్థానం ఉచిత వైద్యశాలకు తరలించారు. డాక్టర్లు పరీక్షించి గుండె పోటుతో మృతిచెందినట్లు ధ్రువీకరించారు. ఆమె బంధువులు రక్తసంబంధీకులు తీవ్ర విషాదం వ్యక్తం చేస్తూనే శ్రీశైల మహా క్షేత్రంలో శివునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం రోజు ఆ మహా శివుడే ఆమెను తీసుకువెళ్లాడని తీసుకెళ్లాడని భావిస్తున్నారు.

మహానందీశుని ఉత్సవాలకు పట్టుగొడుగులు


దాతలు అందించిన గొడుగులను చూపుతున్న ఈఓ, పండితులు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వర స్వామి పల్లకీ సేవలు, ఉత్సవాలకు దాతలు పట్టు గొడుగులను విరాళమిచ్చారు. గోపవరం గ్రామానికి చెందిన సంగా లక్ష్మీకాంతరెడ్డి, మాధవి, కుశాల్ కుటుంబ సభ్యులు సోమవారం ఈఓ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు రవిశంకర అవధానిలను కలిసి గొడుగులను అందించారు. దాతలను ఆలయ అధికారులు అభినందించారు. కాగా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చి కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామీఅమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

శ్రీశైలం: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పాదయాత్రగా శ్రీశైలం చేరుకున్న బీజేపీ నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి శివాజీ స్ఫూర్తి కేంద్రం వద్ద 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శనానంతరం ఆమె ఛత్రపతి శివాజీ మెమోరియల్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. స్ఫూర్తి కేంద్రం వారు ప్రచురించిన క్యాలెండర్‌ను శివాజీ కాంస్య విగ్రహం వద్ద ఆవిష్కరించి కార్యకర్తలకు, పార్టీ నాయకులకు అందజేశారు.